
సాక్షి
తిరుపతి
గురువారం । 9 । జనవరి । 2025



క్రీడా సాంస్కృతిక పోటీలు

ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో అంతర కళాశాల క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు రసవత్తరంగా సాగుతున్నాయి. - 8లో



తుమ్మలగుంటకు వైకుంఠ శోభ

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తుమ్మలగుంటలోని కల్యాణ వెంకన్న ఆలయం ముస్తాబైంది. - 8లో



గంజాయి స్వాధీనం

జిల్లావ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో సుమారు 100 కేజీల గంజాయి పట్టుబడినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

'జనశక్తి-మనశక్తి'ని ఆవిష్కరించిన వైఎస్ జగన్



పుస్తకం ఆవిష్కరిస్తున్న వైఎస్ జగన్

తిరుపతి అర్బన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా తిరుపతికి చెందిన కాపి రెడ్డి కృష్ణారెడ్డి రచించిన జనశక్తి–మనశక్తి పుస్తకాన్ని బుధవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అవర్ స్టేట్–అవర్ లీడర్ సోషల్ మీడియా మెంబర్స్ ఆధ్వర్యంలో కాపిరెడ్డి కృష్ణారెడ్డి, ఆయన సతీమణి శాంతమూర్తి పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సుపరిపాలన విధానాలను పద్యరూపంలో వివరించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను సత్కరించినట్లు తెలిపారు.

ఉపాధిలో అవకతవకలు

- ఆరుగురి సస్పెన్షన్

దొరవారిసత్రం : ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన ఇద్దరు టీఏలు, ముగ్గురు ఎఫ్ఏలు, జేఈపై సస్పెన్షన్ వేటు పడింది. బుధవారం ఈ మేరకు ఉత్తర్వులను పీడీ శ్రీనివాస ప్రసాద్ జారీ చేశారు. అలాగే ఉపాధి సిబ్బంది నుంచి రూ.7.75లక్షలు, పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.97వేలు రికవరీ చేయాలని పేర్కొన్నారు. ఇటీవల దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై నిర్వహించిన 17వ సామాజిక తనిఖీలో సిబ్బంది అవినీతి వెలుగుచూసింది. ఈ మేరకు టీఏలు షమ్మీఉద్దీన్, కోటేశ్వరయ్య, జేఈ మునీంద్రతోపాటు ఆనేపూడి, తల్లంపాడు, ఏకొల్లు ఎఫ్ఏలపై వేటు పడింది. ఈ ఇద్దరు టీఏల అక్రమాలు గత ఏడాది నిర్వహించిన 16వ సామాజిక తనిఖీలో కూడా బయటపడి సస్పెన్షన్‌కు గురికావడం గమనార్హం.

రుయా అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రి అభివృద్ధికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం ఎస్వీ వైద్య కళాశాలలో రుయా అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని, ఈ మేరకు ఆస్పత్రిలో మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ రవి ప్రభు మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యలనువివరించారు. అనంతరం అజెండా అంశాలను నివేదించారు. ఈ క్రమంలో రుయా ఆస్పత్రికి అవసరమైన పరికరాల కొనుగోలు, వివిధ విభాగాల్లో మరమ్మతులకు అవసరమైన రూ.20.85లక్షల మంజూరుకు ఆమోదం తెలిపారు. అలాగే హెచ్‌డీఎస్ కమిటీ కోసం మరో ఇద్దరు సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతోనే ఉత్తమ భవిత



అవార్డు అందిస్తున్న లక్ష్మీనారాయణ, హేమాద్రియాదవ్

తిరుపతి సిటీ : విద్యార్థులు ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని ఆ దిశగా అడుగులు వేస్తేనే ఉత్తమ భవిత సాధ్యమని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నిర్వహించిన ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, టెక్నాలజీని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. పిల్లలను ప్రోత్సహించేందుకు పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ మాట్లాడుతూ తిరుపతిలో ఇంటర్ నుంచి పీజీ వరకు ప్రతిభ చూపిన విద్యార్థులను గుర్తించి ప్రతిభా అవార్డులు అందిస్తున్నామని వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి శ్రీధర్, వర్సిటీ అధ్యక్షుడు మల్ని ఉపేంద్ర, ఉపాధ్యక్షుడు శ్రీను, నగర అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

హరి.. హరీ!

- వైకుంఠ ద్వార దర్శనం టికెట్లకు పోటెత్తిన భక్తులు
- తూతూమంత్రంగా ఏర్పాట్లు చేసిన టీటీడీ అధికారులు
- క్యూల నియంత్రణలో విఫలమైన పోలీసులు
- తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన పలువురు భక్తులు
- గాయపడిన వారితో నిండిపోయిన ఆస్పత్రులు



నిలబడలేం.. కూర్చోలేం.. ఒకే చోట పడిగాపులు.. కనీస వసతులు లేవు.. అన్నపానీయాలు అందలేదు.. పట్టించుకునేవారు లేరు.. వైకుంఠ ద్వార దర్శనార్థం వచ్చిన భక్తులతో టీటీడీ అధికారులు దారుణంగా వ్యవహరించారు. వీధులనే క్యూలుగా మార్చి అందులో తోసేశారు.. పిల్లలు.. పెద్దలు.. మహిళలనే జ్ఞానం లేకుండా ఇష్టారాజ్యంగా నెట్టేశారు. ఏమాత్రం నియంత్రణ పాటించకుండా పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. కౌంటర్ల వద్ద తూతూమంత్రంగా భద్రత కల్పించారు. టోకెన్ తీసుకునేందుకు పోటీపడే దుస్థితిని తీసుకువచ్చారు. వారి నిర్లక్ష్యం కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు.పెద్దసంఖ్యలో గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. చివరకు సహాయక చర్యల్లోనూ అధికారులు అలసత్వం ప్రదర్శించారు. సకాలంలో వైద్యసేవలందించడంలోనూ వైఫల్యం చెందారు.

– తిరుపతి సిటీ/క్రైం/మంగళం/కల్చరల్/అర్బన్



తిరుపతిలోని రామచంద్ర పుష్కరిణి వద్ద రోడ్డుపై భక్తుల పడిగాపులు







రోడ్డుపైనే నిద్రిస్తూ.. (ఇన్‌సెట్) పోలీసు వలయం ఛేదిస్తూ..



క్యూగా మారిన వీధిలో తొక్కుకుంటూ.. తోసుకుంటూ..



అసహనంతో భక్తుల వాగ్వాదం



దేవుడా ఏంటీ పరీక్ష



భక్తులను నెట్టేస్తున్న పోలీసులు



తోపులాటకు కింద పడిపోయిన భక్తులు

టీటీడీదే బాధ్యత

పెద్దసంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయని టీటీడీ అధికారులే ఈ ఘోరానికి బాధ్యత వహించాలి. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన భక్తుల ప్రాణాలతో చెలగాటమాడారు. ఇంత మంది తీవ్రంగా గాయపడేందుకు కారణమయ్యారు. పోలీసులు సైతం అత్యంత బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించారు. ఈక్రమంలో ప్రభుత్వం స్పందించాలి. బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలి.

– మురళి, జిల్లా కార్యదర్శి, సీపీఐ

ప్రాణాలతో చెలగాటం

టీటీడీ అధికారులు శ్రీవారి భక్తుల ప్రాణాలతో చెలగాటమాడారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్లు పంపిణీ చేసేందుకు పది రోజుల నుంచి ఏర్పాట్లు చేస్తున్నామంటూ ప్రకటనలు గుప్పించారు. చివరకు చేసింది ఇదా. ఇంతమంది ప్రాణాలకు ఎవరు పెడతారా. ఈ ఘోరానికి కారకులను వదిలి పెట్టకూడదు. కఠినంగా శిక్షించాలి. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలి.

– వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి, సీపీఎం

పరిహారం చెల్లించాలి

టీటీడీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇన్ని ప్రాణాలు పోయాయి. బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలి. ఘటనకు కారకులైన పోలీసులపై చర్యలు చేపట్టాలి. శ్రీవారి భక్తులను ఇంతగా ఇబ్బంది పెట్టినందుకు టీటీడీ బోర్డు వెంటనే దిగిపోవాలి. ఈఓ, అదనపు ఈఓ బాధ్యత తీసుకోవాలి. భక్తులకు సేవ చేయాల్సిన అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారు. ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదు.

– కందారపు మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ

విచారకరం

భక్తుల రద్దీకి తగ్గట్టు టీటీడీ అధికారులు ఏర్పాటు చేయలేదు. ఇంత పెద్దసంఖ్యలో భక్తులు తరలి వస్తే కనీస వసతులు కూడా కల్పించలేదు. పైగా క్యూల నిర్వహణ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. భక్తులను క్యూలోకి వదిలేశారే కానీ, అన్నప్రసాదాలు సైతం అందించలేదు. అసలు తొక్కిసలాటకు పోలీసుల వైఖరే కారణం. భక్తులను నిర్దాక్షిణ్యంగా ఒకరిపై ఒకరిని నెట్టేశారు. దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీయాల్సిన దుస్థితి దాపురించింది.

– రాజగోపాల్ రెడ్డి, భక్తుడు, వేంపల్లె

ప్రాణాల మీదకు తెచ్చారు

వైకుంఠ ఏకాదశి నాడు శ్రీవారిని దర్శించుకుందామని కుటుంబంతో కలిసి వస్తే ఇక్కడ పరిస్థితి దారుణంగా ఉంది. టీటీడీ అధికారులు ఏమాత్రం ఏర్పాట్లు చేయలేదు. క్యూలోకి తోసేసి పట్టించుకోలేదు. ఇక పోలీసులైతే చాలా దురుసుగా ప్రవర్తించారు. వారి వ్యవహార శైలే ఇంతమంది ప్రాణాల మీదకు తెచ్చింది. మా కళ్ల ముందే చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించడంలో కూడా ఆలస్యం చేశారు.

– కేశవన్, భక్తుడు, మధురై, తమిళనాడు



రోడ్డుపైనే వంట చేసుకుంటున్న భక్తులు

సమీక్ష.. ఏంటీ శిక్ష!

- సీఎం చంద్రబాబు తీరుతో అధికారుల అవస్థలు
- అర్ధరాత్రి వరకు సమావేశాలపై ఆవేదన

నిత్యం విధి నిర్వహణలో బిజీ ఉంటాం. అహర్నిశలు ప్రజా సమస్యల పరిష్కారానికే కృషి చేస్తుంటాం. వివిధ అభివృద్ధి పనులు.. సంక్షేమ పథకాల అమలుపై నివేదికలు అందిస్తుంటాం. అలాగే వీడియో కాన్ఫరెన్స్‌లు.. టెలీ కాన్ఫరెన్సులతో ఊపిరి తీసుకునే అవకాశం కూడా లేకుండా పనిచేస్తుంటాం. ఇదంతా మా బాధ్యతలు నెరవేర్చడంలో భాగం. సంతోషంగా ఆ పనులు పూర్తి చేస్తాం. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టే సమావేశాలతోనే అసలు తంటా వస్తోంది అంటూ అధికారులు నెత్తీనోరు బాదుకుంటున్నారు. అర్ధరాత్రి వరకు సమీక్షించడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సాక్షి టాస్క్‌ఫోర్స్ : సీఎం చంద్రబాబు కుప్పంలో అర్ధరాత్రి వరకు సమీక్షా సమావేశం నిర్వహించడంపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా సీఎం పర్యటనలో అలసిపోయిన తర్వాత మళ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడం సరికాదనితీవ్రంగా తప్పుబడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు పర్యటించిన విషయం తెలిసిందే. సీఎం పర్యటన ఖరారైనప్పటి నుంచి కలెక్టర్, ఎస్పీతోపాటు అన్ని శాఖల అధికారులు వారం రోజులుగా కుప్పంలోనే తిష్ట వేశారు. నియోజకవర్గంలో పర్యటిస్తూ ఇప్పటి వరకు జరిగిన పనులు, అవసరమైనవి, పూర్తి చేయవలసినవి, అవసరమైన నిధులపై నివేదికలు సిద్ధం చేశారు. సోమవారం మధ్యాహ్నం కుప్పానికి చేరుకున్న సీఎం చంద్రబాబు మొదటి రోజు కార్యక్రమాలన్నీ పూర్తయ్యేసరికి అర్ధరాత్రి అయ్యింది. మరుసటి రోజు మంగళవారం సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. అన్నీ ముగించుకుని రాత్రి 10 గంటలకు ద్రవిడ యూనివర్సిటీలోని సెమినార్ హాలుకి చేరుకుని అధికారులతో సమీక్ష సమావేశం ప్రారంభించారు. వాస్తవానికి కార్యక్రమం రాత్రి 7.30 గంటలకు సమీక్ష పూర్తి కావాల్సి రాత్రి 10 తర్వాత ప్రారంభమైన సమావేశం 12.20 గంటల వరకు సాగింది.

ఇవేం కష్టాలు బాబోయ్!

ముఖ్యమంత్రి సమావేశానికి సీనియర్ అధికారులు, పిల్లలు ఉన్న తల్లులు హాజరైనట్లు తెలిసింది. రాత్రి 7.30 గంటలకు మీటింగ్ ముగుస్తుందని, ఇళ్లకు వెళ్లిపోవచ్చని భావించారు. అయితే అర్ధరాత్రి దాటే వరకు సమావేశం కొనసాగించడంతో పలువురు అధికారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. బుధవారం ఎటువంటి కార్యక్రమాలు లేకపోయినా ఎక్కువ మంది అధికారులు ప్రొటోకాల్ ప్రకారం సీఎం చంద్రబాబు బయలుదేరే సమయం వరకు కుప్పంలోనే ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఇవేం కష్టాలు బాబోయ్ అని అధికారులు చర్చించుకోవడం గమనార్హం.

ఉత్తీర్ణులకే ఉద్యోగోన్నతి

- ఆర్టీసీ డ్రైవర్లకు పరీక్షలు
- 100 మార్కులకు 40 మార్కులు వస్తేనే పాస్



పరీక్ష రాస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు

తిరుపతి అర్బన్ : విద్యార్థులు పరీక్షలు రాసేది సాధారణం.. ఉద్యోగాల కోసం యువత పరీక్షలు రాయడం తెలిసిందే.. అయితే ఆర్టీసీలో ప్రమోషన్ కోసం డ్రైవర్లు ఎగ్జామ్ రాయాల్సి వస్తోంది. చిన్నపాటి ఉద్యోగోన్నతి పొందాలన్నా కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన ఆర్టీసీలో డ్రైవర్లకు ఉంది. ఈక్రమంలో 8వ తరగతి వరకు చదవని వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా 508 మంది ఆర్టీసీ డ్రైవర్లు ఎగ్జామ్‌కు హాజరవుతున్నారు. వీరంతా 50 ఏళ్లు పైబడిన వారే కావడం విశేషం. ఈ పరీక్షలో ఉత్తీర్ణుమైన వారికే ఉద్యోగోన్నతి ఇవ్వనున్నారు.

పరీక్షలు ఇలా...

పరీక్షకు రెండు గంటల సమయం ఇచ్చారు. 100 మార్కులకు గాను 40 మార్కులు సాధిస్తేనే ఉత్తీర్ణులైనట్లు. నెల్లూరుకు చెందిన డిప్యూటీ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ పర్యవేక్షణలో బుధవారం తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో పరీక్షలు ప్రారంభించారు. ఇన్విజిలేటర్‌గా జిల్లా పర్సనల్ ఆఫీసర్ సహజాద్ విధులు నిర్వర్తించారు. రోజుకు 50 నుంచి 60 మందికి పరీక్షలు నిర్వహించేలా డ్రైవర్లుకు టైమ్ టేబుల్ ఇచ్చేశారు. వారం, పది రోజుల పాటు పరీక్షలు జరగనున్నాయి.

చూసి రాయడమే..

పరీక్ష అంటే అందులో ప్రశ్నలు ఇస్తే.. డ్రైవర్లు జవాబులు రాయాల్సిన పనిలేదు. కేవలం పది పేజీల బుక్‌లెట్‌ను అందిస్తారు. అందులో ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవర్లు పాటించాల్సిన అంశాలు ఉంటాయి. డ్రైవర్లకు ఇచ్చే బుక్‌లెట్‌లో రెండు గంటల లోపు ట్రాఫిక్ రూల్స్‌ను చూసి రాసి ఇవ్వాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

సంకల్ప బలంతో లక్ష్య సాధన



కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : సంకల్ప బలంతో యువత లక్ష్యాలు సాధించగలరని, విలువలతో కూడిన విజ్ఞానంతోపాటు క్రమశిక్షణతో సన్మార్గంలో నడవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. డాలర్స్ గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెగా ఇంపాక్ట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన ఉచిత వ్యక్తిత్వ వికాస సదస్సు బుధవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోపాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆ దిశగా విద్యార్థులకు సహకారం అందిస్తున్న దివాకర్‌రెడ్డి అభినందనీయులన్నారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాలపై యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. తల్లిదండ్రులకలలను సాకారం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వివేకానంద, ఆదిశంకరాచార్య, రామానుజ, భగత్ సింగ్, సుఖ్‌దేవ్ వంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీపాదమ్ యువత ఉజ్వల భవితను నిర్దేశించే మార్గదర్శకాలను వివరించారు. అనంతరం అతిథులను దివాకర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

'ఏటి పండుగ'కు పకడ్బందీ ఏర్పాట్లు



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని స్వర్ణముఖి నదీతీరంలో ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న ఏటి పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. బుధవారం ఆమె మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాతో కలిసి పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటి పండుగ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ షేక్ రఫీ, నేతలు పార్థసారథి, ఎన్ రాజేష్ పాల్గొన్నారు.

యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీల నియామకం





తిరుపతి ఎస్వీయూ ప్రధాన ద్వారం, మహిళా వర్సిటీ ప్రధాన ద్వారం



కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం

- గవర్నర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు
- త్రిసభ్య కమిటీలో యూజీసీ, ఈసీ, రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన వ్యక్తుల నియామకం
- ఈ నెలాఖరులోపు పూర్తిస్థాయి వీసీలను ప్రకటించే అవకాశం

తిరుపతి సిటీ: చరిత్రను తిరగరాస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా విశ్వవిద్యాలయాలకు ఉపకులపతుల పోస్టులకు వందల సంఖ్యలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చిపడ్డాయి. పోటీ తీవ్రతను గమనించిన ప్రభుత్వం వీసీల నియామకాలపై కాలయాపన చేస్తూ వచ్చింది. ఎట్టకేలకు ఉన్నత విద్యామండలి చైర్మన్ నియామకాన్ని పూర్తిచేసి వీసీల నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీ, కుప్పం ద్రవిడ యూనివర్సిటీల వీసీల నియామకానికి వేర్వేరుగా త్రిసభ్య కమిటీలను నియమిస్తూ బుధవారం గవర్నర్ కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. మన రాష్ట్రానికి సంబంధం లేని వ్యక్తులను త్రిసభ్య కమిటీలో సభ్యులుగా నామినేట్ చేశారు.

ఎస్వీయూ సెర్చ్ కమిటీ

రాష్ట్ర ప్రభుత్వం తరపున రాయ్‌పూర్‌కు చెందిన ఐఐఎం డైరెక్టర్ డాక్టర్ రామ్‌కుమార్ కాకాని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తరపున ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వీఎస్ రావు, యూజీసీ నియమించిన అహ్మదాబాద్ డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అమియా ఉపాధ్యాయ సెర్చ్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

పద్మావతి మహిళా వర్సిటీ సెర్చ్ కమిటీ

రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆదికవి నన్నయ్య వర్సిటీ మాజీ వీసీ కే.నిరుపమరాణి, ఈసీ నామినేటెడ్ పర్సన్‌గా హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, యూజీసీ తరపున మధ్యప్రదేశ్ డాక్టర్ హరీసింగ్ గౌర్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ నీలిమ గుప్తాను నియమిస్తూ గవర్నర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

కుప్పం ద్రవిడ వర్సిటీకి..

గౌహతికి చెందిన ఎన్‌ఐపీఈఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ యూఎస్ఎన్ మూర్తి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తరపున ఏపీఎస్‌సీహెచ్‌ఈ మాజీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పి.నరసింహరావు, యూజీసీ తరపున ఢిల్లీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌కే సరిన్ సెర్చ్ కమిటీ సభ్యులుగా నియమించారు.

ఆశావాహుల్లో పెరిగిన ఉత్కంఠ

ఉమ్మడి జిల్లాలోని మూడు వర్సిటీలకు వీసీల నియామక ప్రక్రియ ప్రారంభం కావడంతో ఆశావహులు విజయవాడ స్థాయిలో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో రాష్ట్ర మంత్రులను కలసి తమకే వీసీగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు సీఎం అపాయింట్‌మెంట్ కోసం ఆశావాహులు పెద్ద సంఖ్యలో క్యూ కడుతున్నట్లు సమాచారం. ఎస్వీయూ వీసీ పోస్టు కోసం సుమారు 250 వరకు దరఖాస్తులు ఉన్నత విద్యామండలికి అందినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే మహిళా వర్సిటీకి 124 మంది, కుప్పం ద్రవిడ వర్సిటీకి 98 మందికి పైగా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఆశావాహుల భవితవ్యం ఈనెలాఖరు లోపు తేలనుంది.

రసవత్తరంగా అంతర కళాశాలల క్రీడా సాంస్కృతిక పోటీలు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వేదికగా మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న వెటర్నరీ అంతర కళాశాలల క్రీడా సాంస్కృతిక పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. బుధవారం 100 మీటర్ల పరుగు పందెం, డిస్కత్రో సింగిల్స్ విభాగంలో తిరుపతి డెయిరీ కళాశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. అలాగే షాట్‌పుట్, చెస్‌పోటీల పురుషుల విభాగంలో తిరుపతి పశువైద్య కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. టేబుల్ టెన్నిస్, చెస్ మహిళా విభాగంలోనూ తిరుపతి వెటర్నరీ కళాశాల విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రొద్దుటూరు, గరివిడి, గన్నవరం వెటర్నరీ కళాశాల విద్యార్థులు వాలీబాల్, జావెలిన్ త్రో, క్యారమ్స్, హైజంప్, 5 వేల మీటర్ల పరుగు పందెం విభాగాల్లో ప్రథమ స్థానం దక్కించుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక పోటీలు వీక్షకులను అలరించాయి. పోటీలను అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ జగపతి రామయ్య, పీడీ జయచంద్ర పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం బాస్కెట్ బాల్ (ఉమెన్స్) ఫైనల్స్, మధ్యాహ్నం క్రికెట్ ఫైనల్స్, టెన్నికాయిట్ (బాలికలు) ఫైనల్స్, బాల్‌బ్యాడ్మింటన్ బాలుర ఫైనల్స్ నిర్వహించనున్నట్టు పీడీ తెలిపారు.



టేబుల్ టెన్నిస్ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

100 కిలోల గంజాయి స్వాధీనం

- రెండు కేసుల్లో ఆరుగురి అరెస్ట్
- మూడు కార్లు స్వాధీనం
- తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా పరిధిలో 100 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సుబ్బరాయుడు ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెల ఏడో తేదీ తెల్లవారుజామున కోట క్రాస్, కడివేడు ప్రాంతంలో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు చిలుకూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం వచ్చింది. దీంతో తమ సిబ్బంది అప్రమత్తమై పుత్తూరుకు చెందిన పసుపులేటి గిరిబాబు, తమిళనాడుకు చెందిన మోహస్ మదాస్ కుమార్, పందనాదాస్ అజయ్, వసుంధరం కీరుబాకరన్‌ను అరెస్ట్ చేశారు. వీరిని తమదైన శైలిలో విచారించగా, ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. వీరంతా చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. వీరిలో మొదటి నిందితుడు గిరిబాబు హోంగార్డుగా పని చేస్తూ ఉద్యోగం నుంచి తొలగించబడ్డాడు. మిగిలిన వారితో కలిసి కాకినాడలోని తునిలో అప్పలనాయుడు, హరి నుంచి గంజాయిని కొని గుమ్మలపూడి ప్రాంతానికి చెందిన అరుల్, షారుక్‌కు విక్రయించేవాడు. అలా వచ్చిన డబ్బులతో పుత్తూరులో నివాసం ఉంటూ జల్సాలు చేసేవారు. అక్కడ కూడా చిన్న చిన్న పొట్లాలు చేసుకుని విక్రయిస్తూ డబ్బులు సంపాదించేవాడు. ఇదే క్రమంలో గంజాయి తీసుకోవడానికి పసుపులేటి హరిబాబు, అంజనా దాస్ అజయ్‌తో కలిసి మరో ఇద్దరు నిందితులు ఏడో తేదీ తునిలో గంజాయిని కొనుగోలు చేసి చిలుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వెళ్తుండగా వీరిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వారి నుంచి 72 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా వీరి నుంచి రెండు కార్లను కూడా స్వాధీనం చేసుకున్నారు.

శ్రీసిటీ పాయింట్ వద్ద..

శ్రీసిటీ పాయింట్ వద్ద షారుక్ ఖాన్, అరుల్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో షారుక్ ఖాన్‌పై తమిళనాడులో హత్య కేసుతో పాటు గంజాయి కేసులు కూడా ఉన్నాయని తెలిపారు. వీరి నుంచి ఓ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదిలా ఉంటే ఓ వాహనానికి తమిళనాడులోని ఒక ప్రధాన పార్టీ జెండాను పెట్టుకుని అక్రమ రవాణాకు పాల్పడినట్లు చెప్పారు. అయితే విచారణలో వీరు ఏ పార్టీకి సంబంధం లేదని కేవలం పెడదారి పట్టించేందుకే ఈ జెండాను పెట్టుకున్నట్లుగా పోలీసులు తెలిపారు.

33 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 33 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే తిరుపతిలో రోడ్లకిరువైపులా వ్యాపారం చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న 22 మందికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి తీర్పు చెప్పినట్లు తెలిపారు. వీరిపై పోలీసులు కేసులు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరచగా ఈ మేరకు జరిమానా విధించారన్నారు.

అనుమానాస్పద మృతిపై దర్యాప్తు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ వద్ద మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన నాగలక్ష్మి కేసులో సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు సూళ్లూరుపేట రైల్వే ఎస్‌ఐ చెన్న కేశవులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు మృతురాలి భర్తను పెనిమమేటి అంకయ్యగా గుర్తించామన్నారు. నాగలక్ష్మి కుటుంబీకులు భిక్షాటన చేస్తూ పొట్టపోసుకుంటున్నారన్నారు. అంత్యక్రియలకు సైతం ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. మృతురాలి తల్లి సుబ్బమ్మ మాట్లాడుతూ తమ కుమార్తెను రెండో పెళ్లి చేసుకున్న అంకయ్య మద్యానికి బానిసగా మారాడన్నారు. అతడే తమ బిడ్డను చంపేసి ఉంటాడని ఆరోపించారు. అంకయ్య తమ మనవరాలిని కూడా తీసుకెళ్లిపోయాడని, బిడ్డను కాపాడాలని కోరారు.



ప్రభుత్వాస్పత్రి వద్ద మృతురాలి కుటుంబీకులు

శ్రీసిటీ ప్రగతికి ప్రధాని ప్రశంస

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసించారు. బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ శ్రీసిటీ కారణంగా ఉత్పత్తి రంగంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రస్తావించారు. పారిశ్రామికంగా దేశంలోని అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ఇప్పటికే శ్రీసిటీ రూపంలో ఆ దిశగా పయనిస్తోందని వెల్లడించారు. ప్రధాని కితాబు దక్కడం సంతోషంగా ఉందని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు.



విశాఖ సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

ఘనంగా రంగోత్సవ్ పోటీలు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో బుధవారం 2024–25 ఉమ్మడి జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ డైట్ కళాశాల ఆవరణలో రెండు జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులకు ఎనిమిది అంశాల్లో పోటీ నిర్వహించగా అందులో దాదాపు 70 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్నారని పేర్కొన్నారు. రోల్‌ప్లేలో పచ్చికాపల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. ఐశ్వర్య, రంగోలి పోటీలో జీ.ఎం యూపీఎస్ డైట్ కార్వేటినగరానికి చెందిన కే.హిమశ్రీ బృందం, డిజిటల్ పోస్టర్ పోటీలో జెడ్పీహెచ్ఎస్ కార్వేటినగరం బాలికల పాఠశాలకు చెందిన కేఎం ధనశ్రీ విజేతలుగా నిలిచారన్నారు. అలాగే ఫోక్ డ్యాన్స్ పోటీలో జెడ్పీహెచ్ఎస్ కమ్మపల్లి గ్రామానికి చెందిన ఎం.ఉమాదేవీ అండ్ టీం, డ్రాయింగ్ పోటీలో కొత్తపల్లిమిట్ట జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎం.సౌమ్యప్రీతి విజయం సాధించారన్నారు. స్లోగన్ పోటీలో వరదయ్యపాళెం మండలంలోని సంత వేలూరు ఉన్నత పాఠశాలకు చెందిన పీ.జయశ్రీ, హ్యాండ్ రైటింగ్ పోటీల్లో చిత్తూరు జీహెచ్ఎస్‌కు చెందిన జీ.హాసని, క్విజ్ పోటీల్లో సంత వేలూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఝాన్సీ, నిచిత ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ తెలిపారు. అనంతరం రంగోత్సవ్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించి, అభినందించామన్నారు. అలాగే విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

తుమ్మలగుంటకు వైకుంఠ శోభ



విద్యుద్దీపాలంకరణలో వెంకన్న ఆలయం



తుమ్మలగుంటలోని ఓ వీధిలో ఏర్పాటు చేసిన లైటింగ్

తిరుపతి రూరల్ : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుపతి సమీపంలోని తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయం దేదీప్యమానంగా విరాజిల్లుతోంది. గ్రామంలోని ప్రధాన వీధులు విద్యుద్దీపాల వెలుగులు విరజిమ్ముతున్నాయి. అలాగే చంద్రగిరి, కాలూరు, చెర్లోపల్లె, తిరుచానూరు, వేదాంతపురం సర్కిల్, మల్లవరం సర్కిల్, ఉప్పరపల్లెలో ఏర్పాటు చేసిన భారీ స్వాగత తోరణాలు ఆకట్టుకుంటున్నాయి.

విశేష పుష్పాలంకరణ

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని ఉత్తర ద్వారాన్ని విశేషంగా అలంకరించారు. సుమనోహర పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే పెద్దసంఖ్యలో తరలిరానున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారి నుంచి సంక్రాంతి పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సామాజిక, సాంస్కృతిక సేవ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఈఎస్ఎన్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, ఇంజినీర్లు, యోగా, ధ్యానం, సంగీతం, క్రీడలు, సాహిత్యం, వైద్యం, కరాటే, మెమరీ పవర్, నృత్యం, సినీ టీవీ రంగాలకు చెందిన వారు సంక్రాంతి పురస్కారాలకు అర్హులన్నారు. ఇందులో ఎంపికైన వారికి ఈనెల 19న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు తమ సేవలను తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల కటింగ్స్, జిరాక్స్, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈనెల 10వ తేదీలోపు సర్వేజనా సుఖినోభవంతు, డోర్ నెంబర్ -1-20-164, గోకుల్ నగర్, తిరుమలగిరి పోస్టు, వెంకటాపురం, సికింద్రాబాద్-15 చిరునామాకు దరఖాస్తులు పంపాలన్నారు. వివరాలకు 9652347207ను సంప్రదించాలని ఆయన కోరారు.


ఈతకు వెళ్లి యువకుడి మృతి



కత్తి విజయ్(ఫైల్)

చంద్రగిరి : మండలంలోని పనపాకం దళితవాడకు చెందిన కత్తి విజయ్(30) అనే యువకుడు బుధవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని కోవిటువారి చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహం వెలికితీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాషింగ్ మెషిన్‌లో మంటలు



కాలిపోయిన వాషింగ్ మిషన్

నాయుడుపేట టౌన్ : స్థానిక రాజగోపాలపురం నాలుగో వీధిలోని ఓ ఇంట్లో బుధవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా వాషింగ్ మిషన్‌లో మంటలు చెలరేగాయి. బాధితుడు గురవయ్య అందించిన సమాచారం అందుకున్న వి అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శనం టిక్కెట్లు లేనివారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఎంబీయూలో సంక్రాంతి సంబరాలు

చంద్రగిరి : మోహన్‌బాబు యూనివర్సిటీలో బుధవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాలిపటాలు ఎగురవేయడం, వంటలు, కోలాటాలు, కర్రసాము, గొబ్బెమ్మ పాటలు, టగ్ ఆఫ్ వార్, బిళ్లంగోడు, కబడ్డీ, ఖోఖో వంటి గ్రామీణ క్రీడలతో సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంబీయూ చాన్సలర్ మంచు మోహన్‌బాబు హాజరయ్యారు. అధ్యాపకులు, విద్యార్థులతో కలసి కోలాటాలు ఆడుతూ, ఉట్టి తాడు లాగుతూ ఉల్లాసంగా గడిపారు. మోహన్‌బాబు మాట్లాడుతూ తెలుగు జాతికి వెలుగులు తీసుకువచ్చే సంక్రాంతిని ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ధనుర్మాసంలో పెద్దలను స్మరించుకుంటూ వారికి నూతన వస్త్రాలు పెట్టి దైవంలా కొలుచుకోవడం మన సంప్రదాయమన్నారు. అచ్చ తెలుగు పండుగను విద్యార్థులతో కలసి జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న భక్త కన్నప్ప సినిమా విశేషాలనుమీడియాతో పంచుకున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను న్యూజిలాండ్‌లో చిత్రీకరించినట్లు వెల్లడించారు. బడ్జెట్ ఎక్కువైనా రాజీ పడకుండా నిర్మిస్తున్నట్లు వివరించారు. గతంలో శ్రీకాళహస్తీశ్వరునిపై వచ్చిన మూడు సినిమాలు అద్భుత విజయం సాధించాయని, అదే తరహాలో భక్తకన్నప్ప కూడా బ్లాక్‌బస్టర్ హిట్ కావడం తథ్యమని స్పష్టం చేశారు. ఏప్రిల్ 25వ తేదీన ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు యూనిట్ శ్రమిస్తున్నట్లు వెల్లడించారు.



కోలాటమాడుతున్న మంచు మోహన్‌బాబు

చోరీ కేసులో మహిళ అరెస్ట్

నారాయణవనం : వృద్ధురాలిపై దాడి చేసి నగలు దోచుకున్న కేసులో నిందితురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం పుత్తూరు డీఎస్పీ రవి కుమార్ వివరాలు వెల్లడించారు. నారాయణవనం నవసందు వీధిలో ఓసూరమ్మ(80) నివసిస్తోంది. అదే వీధిలో టిఫిన్ దుకాణం నడుపుకుంటున్న వళ్లెమ్మ తరచూ ఓసూరమ్మ ఇంటికి వస్తూ పరిచయం పెంచుకుంది. ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలి ఇంట్లో బంగారు నగలు ఉన్నట్లు గమనించింది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఓసూరమ్మ ఇంటికి వెళ్లి దాడి చేసింది. స్పృహ కోల్పోయిన వృద్ధురాలి నుంచి 16 సవర్ల నగలు దోచుకెళ్లింది. సోమవారం ఈ మేరకు బాధితురాలి చెల్లెలు కుమారుడు అయ్యప్పన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం సాయంత్రం నిందితురాలిని అదుపులోకి తీసుకుని చోరీ చేసిన నగలను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించిన సీఐ సురేంద్రనాయుడు, ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటేష్, క్రైమ్ సిబ్బంది దాము, మోహన్, ఏఎస్‌ఐ జయరామ్ నాయక్, పీసీలు భాస్కర్ ప్రమీలను డీఎస్పీ అభినందించారు.



నగలతోపాటు నిందితురాలి అరెస్ట్ చూపుతున్న పోలీసులు